# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

WWW.DASHANEWS.COM

శనివారం 15-08-2026

సంపుటి 1 సంచిక 263

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195





4లో

## ఎన్నో మార్పులు.. అయినా ఇంకా

80వ స్వాతంత్ర్య దినోత్సవం వైపు భారత్ అడుగులు వేస్తున్న వేళ..

ఆసక్తికరంగా సామాజిక జీవనంలో చోటుచేసుకున్న మార్పులు

కొరత నుంచి ఎంపికల దిశగా.. స్కూటర్ కల నుంచి ఎలక్ట్రిక్ కార్ల వరకు

స్మార్ట్‌ఫోన్‌లో ప్రీమియం మోజు....విదేశీ ప్రయాణాలు.. వినోదానికి భారీ ఖర్చు

పొదుపు నుంచి సంపద సృష్టి వైపు...టైర్-2, టైర్-3 నగరాల వైపు వినియోగం

అభివృద్ధి పెరిగినా.. సవాళ్లు మిగిలే



# విద్యార్థులకు శుభవార్త

## ఇక ముందుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్

**దశ, హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందుగానే విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విద్యార్థులు ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులకు నిధులు ముందుగానే అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రతి ఏటా రూ.2,400 కోట్లను విద్యార్థుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యా సంస్థల యాజమాన్యాలు నిలిపివేయడానికి వీల్లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఇంజనీరింగ్, డాక్టర్ వంటి డిగ్రీలు ఉంటే ఉద్యోగం వచ్చే పరిస్థితి లేదని సీఎం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలను

..మిగతా 4వ పేజీలో →





# ఘనంగా గోదావరి పుష్కరాలు

### మంత్రి శ్రీధర్‌బాబు

దశ, హైదరాబాద్: 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. భక్తులకు ఘాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వైద్యం, భద్రత వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గోదావరి తీరంలోని 8 జిల్లాల్లో 67 పుష్కర ఘాట్లను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖల పరిధిలో సుమారు రూ.1,000 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పనుల పురోగతిని డ్యాష్‌బోర్డు ద్వారా సీఎం ఎప్పటికప్పుడు సమీక్షించేలా చర్యలు తీసుకోవాలని శ్రీధర్‌బాబు ఆదేశించారు.



ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు

# నేడు ప్రభుత్వంలో కీలక పదవుల్లో..

### ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి

**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా

..మిగతా 4వ పేజీలో →

### డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో

# భారీ పెట్టుబడుల సదస్సు




**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రధాన థీమ్‌గా సదస్సును నిర్వహించనున్నారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా సదస్సులో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. హైదరాబాద్‌లో భవిష్యత్ మౌలిక వసతులు, పారిశ్రామిక అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించనున్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్ తదితర కీలక రంగాల్లో పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణ స్టార్టప్‌లు, సంస్థలు సాధించిన విజయాలు, కొత్త టెక్నాలజీలు, వినూత్న ఆవిష్కరణలతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. సమ్మిట్ ఏర్పాట్ల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గతేడాది నిర్వహించిన సమ్మిట్ కంటే మరింత విస్తృతస్థాయిలో ఈసారి కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



# సెలబ్రిటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

**దశ, న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో ఫుడ్ ప్రొడక్టులను ప్రచారం చేస్తున్న సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఉత్పత్తి గురించి పూర్తిగా తెలుసుకోకుండా, నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం

..మిగతా 4వ పేజీలో →



# రేషన్ బియ్యం పంపిణీ.. సొమ్మొకడిది సోకొకడిది: ఈటల

దశ, హైదరాబాద్: రేషన్ బియ్యం పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు పెట్టకుండా ఇవ్వాలని, లేదంటే కేంద్రం కూడా నిధులు అందిస్తున్నందున ప్రధాని ఫొటోను సైతం పెట్టాలని అన్నారు.
కేంద్రం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద రాష్ట్రానికి భారీగా బియ్యం అందిస్తోందని ఈటల తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బియ్యం పంపిణీ చేస్తున్నప్పుడు ఒక్క రాష్ట్ర ప్రభుత్వానికే
ఈకేవైసీకి మరో రోజే.. గ్యాస్ వినియోగదారులు అలర్ట్.

..మిగతా 4వ పేజీలో →



# కోమటిరెడ్డికి మహేష్ వార్నింగ్

# ఈ-కేవైసీకి మరో రోజే..

## గ్యాస్ వినియోగదారులు అలర్ట్

'**దశ, హైదరాబాద్:** ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ పూర్తి చేయడంపై మరోసారి దృష్టి సారించాల్సిన సమయం వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఈకేవైసీకి ఆగస్టు 16, 2026 గడువుగా కొన్ని ప్రాంతాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే గడువుపై ప్రాంతాలవారీగా భిన్నమైన సమాచారం ఉండటంతో వినియోగదారులు తమ గ్యాస్ డీలర్‌ను సంప్రదించి నిర్ధారించుకోవడం మంచిది. ఇప్పటివరకు ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం చమురు కంపెనీలు మొబైల్ ఫోన్ ద్వారానే ఫేస్ అథెంటికేషన్ ఉపయోగించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో ఇంటి నుంచే ఈకేవైసీ చేసుకోవచ్చు. ల్ జీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా అన్నది ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడమే ఈకేవైసీ




ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణకు ప్రాధాన్యత ఉంది.మొబైల్ ద్వారా ఈకేవైసీ చేసుకోవాలంటే సంబంధిత గ్యాస్ కంపెనీ అధికారిక యాప్‌ను ఉపయోగించాలి. ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు ముందుగా IndianOil ONE యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత ఈకేవైసీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అవసరమైన వివరాలను పరిశీలించి నిబంధనలకు అంగీకరించిన అనంతరం ఫేస్ స్కాన్ ప్రారంభించాలి. Aadhaar Face RD యాప్‌లో స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటిస్తూ కెమెరా ముందు ముఖాన్ని చూపించాలి. ఫేస్ అథెంటికేషన్ పూర్తయిన తర్వాత ఈకేవైసీ అభ్యర్థనను సబ్మిట్ చేయాలి. ©ఫేస్ అథెంటికేషన్ సమయంలో మొబైల్ కెమెరా స్పష్టంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖంపై నీడ పడకుండా తగినంత వెలుతురు ఉండాలి. కెమెరా ముందు ముఖాన్ని సరిగ్గా ఉంచి యాప్‌లో కనిపించే సూచనలను పాటించాలి. ఆధార్ బయోమెట్రిక్స్ లాక్ చేసి ఉంటే అథెంటికేషన్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం

..మిగతా 4వ పేజీలో →



# 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌ల సమ్మె

**దశ, హైదరాబాద్** తెలంగాణలో ఆటో, యాప్ ఆధారిత క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి బంద్ చేపట్టనున్నట్లు ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ప్రకటించింది. బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన సమావేశంలో 17 కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఇంధనం, నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలని కోరారు. ఓలా, ఉబర్, ర్యాపిడోకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం సొంత యాప్ తీసుకురావాలని, ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12 వేల పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే సీఎం నివాసం, అసెంబ్లీ, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## కోమటిరెడ్డికి మహేష్ వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

కోమటిరెడ్డికి మహేష్ గౌడ్ వార్నింగ్ దశ, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరినీ సహించేది లేదని, ముఖ్యమంత్రి నుంచి సాధారణ కార్యకర్త వరకు అందరికీ ఒకే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఎవరూ పార్టీ కంటే పెద్దవారు కాదన్నారు. మంత్రిపదవులు, ఇతర పదవులపై తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానానిదేనని తెలిపారు. రాజగోపాల్‌రెడ్డి ఇటీవల పార్టీలో సీనియర్లకు గుర్తింపు లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

## ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు కీలక పదవుల్లో..

మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా గళం విప్పింది తానేనని, అందుకే అప్పటి సీఎం కేసీఆర్ తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో తనను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించినా, దానిని కూడా తాను ఒక విజయంగానే భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏపూరి సోమన్న పాడిన 'ఎవరి పాలైందిరో తెలంగాణ' పాటలో ప్రస్తావించిన పరిస్థితులే నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. సోమన్న రూపం, గళం చూస్తే దివంగత ప్రజాగాయకుడు గద్దర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు. ఏపూరి సోమన్న వంటి కళాకారులు, ఉద్యమకారులకు తాను అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలను మార్చే శక్తి తనకు ఉందని, నిజాయితీ కలిగిన వారు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పదవులు కిరీటాలు కావని, ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రమేనని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

## సొమ్మొకడిది సోకొకడిది

మొదటి పేజీ తరువాయి

ప్రచారం కల్పించడం సరికాదన్నారు. రేషన్ కార్డుల కోసం వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం ఎందుకని ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ ఎంపీలు కేంద్ర మంత్రులను కలిసి జవహర్‌నగర్ డంప్‌యార్డు, హైదరాబాద్ మెట్రో, నేషనల్ హైవేలు, ఆర్‌ఆర్‌ఆర్, రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీల అభివృద్ధిపై వినతులు అందించారని చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధుల విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఈటల డిమాండ్ చేశారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీని

**దశ, హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేలా క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్, మైక్రో ప్రింటింగ్, వాటర్‌మార్క్, డిజిటల్ సంతకం వంటి భద్రతా అంశాలతో కార్డులను రూపొందించారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల నమోదుతో రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య 3.42 కోట్లకు చేరింది. తొలి విడతలో ఎంపిక చేసిన వారికి కార్డులు అందించి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు. కాగా, డిసెంబర్ 7 నుంచి 9 వరకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయించింది. సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, హైదరాబాద్‌లో ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్ల పథకానికి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్2కు రూ.2,100 కోట్లకు ఆమోదం తెలిపింది.

## ఈ-కేవైసీకి మరో రోజే..

మొదటి పేజీ తరువాయి

ఎల్‌పీజీ కనెక్షన్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు సరిగ్గా ఉండటం కూడా ముఖ్యమే. వివరాల్లో పొరపాట్లు ఉంటే ఈకేవైసీ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈకేవైసీ గడువుపై ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన తేదీలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆగస్టు 16, 2026 తేదీని గడువుగా పేర్కొంటున్నారు. అయితే అధికారికంగా తమ ప్రాంతానికి వర్తించే గడువును సంబంధిత గ్యాస్ డీలర్ లేదా కంపెనీ అధికారిక యాప్ ద్వారా నిర్ధారించుకోవడం మం

## 80 ఏళ్ల భారతావని..

# ఎన్నో మార్పులు.. అయినా ఇంకా





**80వ స్వాతంత్ర్య దినోత్సవం వైపు భారత్ అడుగులు వేస్తున్న వేళ..**

**ఆసక్తికరంగా సామాజిక జీవనంలో చోటుచేసుకున్న మార్పులు**

**కొరత నుంచి ఎంపికల దిశగా.. స్కూటర్ కల నుంచి ఎలక్ట్రిక్ కార్ల వరకు**

**స్మార్ట్‌ఫోన్‌లో ప్రీమియం మోజు....విదేశీ ప్రయాణాలు.. వినోదానికి భారీ ఖర్చు**


**పొదుపు నుంచి సంపద సృష్టి వైపు...టైర్-2, టైర్-3 నగరాల వైపు వినియోగం**

**అభివృద్ధి పెరిగినా.. సవాళ్లు మిగిలే**

**దశ, న్యూఢిల్లీ:** స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తిచేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవం వైపు భారత్ అడుగులు వేస్తున్న వేళ.. దేశ ఆర్థిక, సామాజిక జీవనంలో చోటుచేసుకున్న మార్పులు ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కూడు, గుడ్డ, ఇల్లు వంటి ప్రాథమిక అవసరాల కోసం పోరాడిన భారతీయ కుటుంబాలు.. నేడు ప్రీమియం ఉత్పత్తులు, విదేశీ ప్రయాణాలు, వినోదం, ఆధునిక సాంకేతిక పరికరాలపై ఖర్చు చేసే స్థాయికి ఎదిగాయి. అయితే ఈ అభివృద్ధి మధ్యలోనూ పేదరికం, ఆదాయ అసమానతలు వంటి సవాళ్లు పూర్తిగా తొలగిపోలేదు. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పుడు దేశం పేదరికం, నిరక్షరాస్యత, ఆహార కొరత వంటి అనేక సమస్యలను ఎదుర్కొంది. అప్పట్లో సగటు కుటుంబాల ఖర్చులు ప్రధానంగా నిత్యావసరాల చుట్టూనే ఉండేవి. కాలక్రమంలో ఆర్థిక వ్యవస్థ విస్తరించడం, ఆదాయాలు పెరగడం, పట్టణీకరణ వేగవంతం కావడంతో ప్రజల జీవనశైలిలో భారీ మార్పులు వచ్చాయి. నేడు కుటుంబాలు ఆహారంతో పాటు రవాణా, ఆరోగ్యం, విద్య, వినోదం, ఎలక్ట్రానిక్స్, గృహవసతి వంటి రంగాలకు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయి. భారతీయుల వినియోగ అలవాట్లలో మార్పుకు ఆటోమొబైల్ రంగం ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఒకప్పుడు స్కూటర్, చిన్న కారు కొనుగోలు చేయడమే పెద్ద ఆర్థిక లక్ష్యంగా ఉండేది. ఇప్పుడు మెరుగైన సౌకర్యాలు, భద్రత, టెక్నాలజీతో కూడిన ఎస్‌యూవీలు, ఎలక్ట్రిక్ కార్లపై వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. వాడిన కార్ల



మార్కెట్‌లోనూ ప్రీమియం మోడళ్లకు డిమాండ్ పెరుగుతోంది. సాంకేతిక ఉత్పత్తుల విషయంలోనూ భారతీయుల కొనుగోలు శక్తి పెరిగింది. రూ.30వేలకుపైగా ధర ఉన్న ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ వాటా 2020లో సుమారు 20 శాతం ఉండగా.. 2025 నాటికి 26 శాతానికి చేరింది. కొత్త ఫీచర్లు, మెరుగైన కెమెరాలు, అధునాతన సాంకేతికత కోసం వినియోగదారులు ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఒకప్పుడు విదేశీ ప్రయాణం కొద్దిమంది సంపన్నులకు మాత్రమే పరిమితమైన విషయంగా ఉండేది. ఇప్పుడు మధ్యతరగతి కుటుంబాల్లోనూ విదేశీ పర్యటనలు సాధారణమవుతున్నాయి. 2025లో భారత పౌరులు 32.83 మిలియన్ల విదేశీ పర్యటనలు చేసినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. సంగీత కచేరీలు, క్రీడా పోటీలు, లైవ్ ఈవెంట్లకు కూడా ప్రజలు భారీగా ఖర్చు చేస్తున్నారు. భారతీయ కుటుంబాల ఆర్థిక ఆలోచనా విధానంలో మరో కీలక మార్పు పెట్టుబడుల విషయంలో కనిపిస్తోంది. గతంలో బ్యాంకు డిపాజిట్లు, బంగారం, స్థిరాస్తులపై ఎక్కువగా ఆధారపడిన కుటుంబాలు ఇప్పుడు ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లుతున్నాయి. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) ద్వారా క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. భారత వినియోగ మార్కెట్ ఇక మెట్రో నగరాలకే పరిమితం కావడం లేదు. టైర్ 2, టైర్ 3 నగరాల్లోనూ ఆదాయాలు, డిజిటల్ కనెక్టివిటీ, ఆన్‌లైన్ వాణిజ్యం పెరగడంతో వినియోగం వేగంగా విస్తరిస్తోంది. గ్రామీణ, పట్టణ కుటుంబాల ఖర్చుల మధ్య అంతరం కూడా క్రమంగా తగ్గుతున్నట్లు తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. దేశ ఆర్థిక ప్రగతి ప్రజల జీవనశైలిని గణనీయంగా మార్చినా.. ఈ ప్రయోజనాలు అందరికీ సమానంగా అందుతున్నాయా అన్నది కీలక ప్రశ్నగా మిగిలింది. పేదరికం, నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సదుపాయాల అందుబాటు వంటి సవాళ్లు ఇంకా ఉన్నాయి. అయినప్పటికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవం దిశగా భారత్ సాగుతున్న ప్రస్థానం.. కొరత నుంచి అవకాశాల వైపు, పొదుపు నుంచి పెట్టుబడుల వైపు, అవసరాల నుంచి ఆకాంక్షల వైపు మారుతున్న ఆధునిక భారతావనికి అద్దం పడుతోంది.






## విద్యార్థులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

పెంపొందించుకోవాలని సూచించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు ఆ తర్వాత స్కిల్స్ నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఏటీసీలు, పాలిటెక్నిక్ విద్య, స్కిల్స్ యూనివర్సిటీతో పాటు వివిధ సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవాలని సీఎం సూచించారు. నర్సింగ్ చదివిన వారికి జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్, ఐటీ రంగాల్లోని కొన్ని ఉద్యోగాలు భవిష్యత్తులో ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడల్లో ప్రతిభ చూపే వారికి ప్రోత్సాహం అందిస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు భారీ నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. "క్రీడల్లో రాణించండి. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించండి. దేశానికి గౌరవం తీసుకురండి. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించండి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి, నగదు నజరానాలు అందించే బాధ్యత నాది" అని సీఎం అన్నారు. phone చదువుకుంటేనే జీవితాలు, తలరాతలు మారుతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. కులాల మధ్య అంతరాలను తగ్గించేందుకు అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట కలిసి చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ విధానాన్ని తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. నెక్లెస్ రోడ్, హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సలహాదారులు కే.కేశవరావు, వి.హనుమంతరావుతో పాటు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సెలబ్రిటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

చేసింది. కొంతమంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాల ఆరోగ్య ప్రయోజనాల గురించి సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా 'ఇమ్యూనిటీ పెంచుతుంది', 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి క్లెయిమ్స్ చేసే ముందు వాటి నిజానిజాలను పరిశీలించాలని FSSAI సూచించింది.

### ఉత్పత్తి వివరాలు తెలుసుకోవాల్సిందే

ఫుడ్ ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేసే సమయంలో దాని ప్యాకేజింగ్, పోషక విలువలు, తయారీదారు పేర్కొన్న ఆరోగ్య క్లెయిమ్స్‌ను పరిశీలించాలని తెలిపింది. కేవలం బ్రాండ్ చెప్పిందనే కారణంతో లేదా డబ్బులు తీసుకున్నందుకు నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయకూడదని హెచ్చరించింది.

### హెల్త్ క్లెయిమ్స్‌కు శాస్త్రీయ ఆధారాలు

ఆహార పదార్థాలు ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయని చెప్పే క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలని FSSAI స్పష్టం చేసింది. ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవిగా ఉండటంతో పాటు వినియోగదారులను తప్పుదోవ పట్టించకూడదని పేర్కొంది.

### పోషకాలు ఉంటేనే 'హెల్తీ ఫుడ్' కాదు

ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా ఇతర పోషకాలు ఉన్నంత మాత్రాన దాన్ని పూర్తిగా ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరికాదని FSSAI పేర్కొంది. సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలను కూడా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా చూడాలని సూచించింది.

### ఫాలోవర్లపై ప్రభావం ఎక్కువ

సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు భారీ సంఖ్యలో ఫాలోవర్లు ఉండటంతో వారు చేసే ప్రచారం వినియోగదారులపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. 'ఇమ్యూనిటీ పెంచుతుంది', 'ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది' వంటి వ్యాఖ్యలను ప్రజలు నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉన్నందున.. ఉత్పత్తుల ఆరోగ్య క్లెయిమ్స్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని FS SAI సూచించింది.

## భట్టి సతీమణి పై గవర్నర్‌కు ఫిర్యాదు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ఘటన చోటుచేసుకుంది ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని గతంలో ప్రయత్నించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినిపై ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. విశ్రాంత ఉద్యోగుల బకాయిల విడుదలకు ఆమె కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అంబర్ పేట న్యాయవాది, సామాజిక కార్యకర్త రేవంత్, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. దీనిపై పకడ్బందీగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. నందిని రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి చూపుతున్నారని, అయితే గతంలో ఎంపీ టికెట్ ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com